# India assumes G20 Presidency

December 01, 2022

# జీ20 అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన భారత్

డిసెంబర్ 01, 2022

1. ఇండోనేషియా నుండి నేడు భారత్ జీ20 అధ్యక్ష బాధ్యతలను లాంఛనంగా స్వీకరించింది. ఇదొక చరిత్రాత్మక ఘటన. జీ20 లేదా గ్రూప్ ఆఫ్ ట్వెంటీగా వ్యవహరించే ఈ కూటమి అభివృద్ధి చెందిన, చెందుతున్న 20 దేశాల అంతర్‌ప్రభుత్వాల వేదికగా పనిచేస్తోంది. తద్వారా అంతర్జాతీయంగా ఆర్థిక సహకారానికి కీలక వేదికగా ఉంటోంది.

2. జీ20 అధ్యక్షతకు సంబంధించి భారత దార్శనికతను వివరిస్తూ ప్రధాని ఈ సందర్భంగా ఒక ఆర్టికల్ రాశారు. దీన్ని ప్రపంచవ్యాప్తంగా పత్రికలు ప్రచురించాయి. సాంత్వన కలిగించేలా, సామరస్యపూర్వకమైన, ఆశాభావంతో కూడుకున్న విధంగా అధ్యక్ష హోదాలో బాధ్యతలు నిర్వర్తించాలని భారత్ కోరుకుంటున్నట్లు ఆర్టికల్‌లో ప్రధాని పేర్కొన్నారు.

3. జీ20 అధ్యక్ష హోదాలో భారత్ నిర్వర్తించే విధుల్లో జీ20ని ప్రజలకు మరింత చేరువకు చేర్చడం, దాన్ని సిసలైన 'ప్రజల జీ20'గా తీర్చిదిద్దడం కీలకాంశంగా ఉండనుంది. దీన్ని సాకారం చేసుకునే క్రమంలో ఇందులో పౌరులను కూడా మమేకం చేయడం, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా ఏడాది పొడవునా వివిధ జన్ భాగీదారీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

4. భారత్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత దేశవ్యాప్తంగా 75 విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు వర్చువల్‌గా పాల్గొనేలా ప్రత్యేక యూనివర్సిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.  విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డా. ఎస్. జైశంకర్, ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ పి.కె. మిశ్రా తదితరులు ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. జీ20 కార్యకలాపాల్లో యువత కూడా పాలుపంచుకునేలా ప్రోత్సహించే ఉద్దేశంతో యూనివర్సిటీ కనెక్ట్ నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో ప్రత్యేకంగా నిర్వహించిన జీ20 సెషన్లలో పాఠశాల విద్యార్థులు కూడా పాలుపంచుకున్నారు.

5. ప్రజల భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహించే దిశగా కోహిమాలో నేడు జరిగిన హార్న్‌బిల్ ఫెస్టివల్‌లో జీ20పై ప్రధానంగా దృష్టి పెట్టారు. కొన్ని యునెస్కో (UNESCO) ప్రపంచ వారసత్వ ప్రదేశాలతో పాటు

ఒక వంద స్మారకాలు నేడు ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో అలంకరించబడుతున్నాయి. ఈ కాంతులీనే స్మారకాలకు సంబంధించి MyGovలో సెల్ఫీ ప్రచార కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా పౌరులను ప్రభుత్వం ఆహ్వానించింది. సైకత శిల్పకారుడు శ్రీ సుదర్శన్ పట్నాయక్ ఒడిషాలోని పూరీ బీచ్‌లో భారత జీ20 లోగోను ఇసుకతో రూపొందించారు.

6. ప్రధాని ఇటీవల ఆవిష్కరించిన జీ20 వెబ్‌సైట్ నేడు విజయవంతంగా g20.org డొమైన్‌కు మైగ్రేట్ అయ్యింది. ట్విటర్ హ్యాండిల్ @g20orgతో పాటు అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను గత ప్రెసిడెన్సీ నుండి భారత్ స్వీకరించింది.

7. 'వసుధైవ కుటుంబకం' – 'ఒకే భూమి ఒకే కుటుంబం ఒకే భవిష్యత్' అనే జీ20 అధ్యక్షత థీమ్ నుండి పొందిన స్ఫూర్తితో 32 వేర్వేరు వర్క్‌స్ట్రీమ్‌ల వ్యాప్తంగా 50 పైచిలుకు నగరాల్లో భారత్ 200 పైగా సమావేశాలు నిర్వహించనుంది. తద్వారా జీ20 ప్రతినిధులు మరియు అతిథులకు సుసంపన్నమైన భారత సాంస్కృతిక వారసత్వం గురించి తెలియజేయనుంది. అలాగే విశిష్టమైన భారతీయ అనుభవాన్ని అందించనుంది.

**న్యూఢిల్లీ**

**డిసెంబర్ 01, 2022**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA's website and may be referred to as the official press release.